క్లుప్తంగా

6ఏ కేసు నమోదు

మద్దిపాడు: మండలంలోని ఘుడియపూడి రేషన్ షాపు డీలర్‌పై 6ఏ కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం సాయంత్రం ఘుడియపూడి రేషన్ షాపును తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్.. బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించి డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



ఉప్పుగుండూరు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ వెంకట నాయుడు

నాగులుప్పలపాడు: సంపద సృష్టి కేంద్రాలతో పాటు గ్రామ పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) వెంకట నాయుడు ఆదేశించారు. గురువారం మండలంలోని ఈదుమూడి, ఉప్పుగుండూరు గ్రామాల్లో చెత్త నిర్వహణ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. అక్కడ నిర్వహిస్తున్న పనులు, ఎరువుల తయారీని పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీలలో రికార్డులు పరిశీలించారు.

రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిట్టిపాటి



చిట్టిపాటి వెంకటేశ్వర్లు

ఒంగోలు సిటీ: అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర వ్యాప్త విలీనసభ గురువారం గుంటూరు నగరంలో జరిగింది. విలీన సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులు, రైతు కూలీలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం 33 మందితో నూతన రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా నుంచి కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు తిరిగి రెండోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పొగాకు, మిర్చి, శనగ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయాలన్నారు. అసైన్మెంట్ యాక్ట్‌ను సవరణ చేసి అర్హులైన దళిత, గిరిజనులకు పట్టాలు ఇవ్వాలన్నారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కార్యదర్శి



గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కార్యదర్శి ఆదిలక్ష్మి

సంతనూతలపాడు: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి గ్రంథాలయ సభ్యత్వాల టార్గెట్ పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ సెస్ ప్రతివారం బకాయిలను సంబంధిత అధికారులను కలిసి వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఒంగోలు సిటీ: రోడ్డు భద్రత నియమాలననుసరించి వాహనాలు నడపాలని ట్రాఫిక్ సీఐ పాండురంగారావు సూచించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వుల మేరకు విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీల్లో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 11 మందిని గురువారం స్పెషల్ జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ వీఎస్ రామారావు వద్ద హాజరు పరిచారు. వారిలో 10 మంది వాహనదారులకు రూ.26 వేల జరిమానా, ఒక్క వాహనదారుడికి రూ.3 వేల జరిమానా, 5 రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై కుటుంబాలను శోకసంద్రంలోకి వెళ్లనివ్వద్దని ఆయన కోరారు.

వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు వన్‌టౌన్: వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయని, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ గాయిత్రీదేవి సూచించారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి విపత్తుల నివారణ సంస్థ హెచ్చరికలకు అనుగుణంగా కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మాగారాలు, దుకాణాల్లో పని చేసే వారు, భవన నిర్మాణ కార్మికులు, వలస కార్మికులు వేసవి విపత్తుల జాగ్రత్తలు పాటించాలన్నారు. యాజమాన్యాలు కార్మికులు పని చేసే ప్రదేశాల్లో చల్లని నీరు, నీడ, వసతి కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే రోజుల్లో కార్మికుల పనివేళలను మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకూ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులకు డీ హైడ్రేషన్ నివారణ మార్గాలపై అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

ఇలా..ఎలా?

- నగరంలో రోడ్లపై ఇష్టారీతిన తవ్వకాలు
- బైకులు సరే..పెద్ద వాహనాలు ఎలా వెళ్లాలి

ఒంగోలు వన్‌టౌన్:

నగరంలో పైప్‌లైన్ల మరమ్మతుల పేరుతో మున్సిపల్ అధికారులు ఇష్టారీతిన తవ్వకాలు చేస్తూ పట్టణ వాసులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. నగరంలోని 15వ డివిజన్ అన్నవరప్పాడు కాలనీ ఇంటర్నల్ రోడ్డు మధ్య మంచినీటి పైపులైన్ల లీకేజీ పేరుతో జేసీబీలతో ఇష్టారీతిన తవ్వారు. తవ్విన సిమెంట్ స్లాబ్‌లను గుంత చుట్టూ, గుంతలో వాహనాలు పడకుండా అమర్చారు. దీంతో వాహనదారులు ఈ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మధ్యలో పది అడుగుల వెడల్పుతో తవ్వి దాదాపు నెల రోజులు కావస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకుని రోడ్డుకు మరమ్మతులు చేయించలేదు. పాదచారాలు, ద్విచక్ర వాహనదారులు పక్క నుంచి వెళ్తున్నారు. పెద్ద వాహనాలు కష్టంగా వెళ్తున్నాయి. మరి కార్లు, బస్సులు ఈ రోడ్డుపై వెళ్లలేవు. మెయిన్ రోడ్డుపై రంగుల బొమ్మలు, గుర్రాలు, నెమళ్లు, స్టీలు రెయిలింగ్‌లు ఏర్పాటు చేస్తున్న అధికారులు.. రద్దీగా ఉండే రోడ్డును పనికి రాకుండా చేశారు. అన్నవరప్పాడు మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. వాహనదారులు కొత్తపట్నం బస్టాండ్ సెంటర్ నుంచి రామనగర్ చివరి వరకూ నిత్యం ప్రయాణిస్తుంటారు. గుంతలు తీసిన రోడ్డుపై నుంచే స్కూలు బస్సులు వెళ్లాలి. రోడ్డుపై తవ్వడంతో బస్సులు ఈ మార్గంలో ప్రయాణించడం లేదు. స్కూల్ విద్యార్థులు మెయిన్ రోడ్డుకు వెళ్లి బస్సులు ఎక్కాల్సి వస్తోంది. ఈ రోడ్డులోనే 4 ప్రైవేట్ హైస్కూల్స్ ఉన్నాయి. ఇతర ప్రాంతాలకు చెందిన స్కూల్ బస్సులు నిత్యం ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటాయి. ఇష్టారీతిన రోడ్డును తవ్వడంతో ప్రస్తుతం ఈ రోడ్డుపై ప్రయాణించడం లేదు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.



అన్నవరప్పాడు 4వ లైన్ పార్కు వద్ద..



అన్నవరప్పాడు శ్రీ సూర్య స్కూల్ ఎదుట..

మంచినీటి సమస్య లేకుండా చూడాలి

- ఇందుకు నగరంలో మున్సిపల్ అధికారుల కేటాయింపు
- శివారు ప్రాంతాలకూ ట్యాంకర్లతో మంచినీటి సరఫరా

ఒంగోలు సబర్బన్: నగరంలోని ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా చూసేందుకు చర్యలు చేపట్టినట్లు నగర కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి కాలం దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో ఎటువంటి అవాంతరాలు ఏర్పడినా, ఆయా ప్రాంతాలకు కేటాయించిన సమయాల్లో నీరు రాకున్నా, పైపులైను లేని ప్రాంతాల్లో నీటి ట్యాంకర్ ద్వారా నీరు రాకున్నా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మంచినీటి సమస్యలను డివిజన్ల వారీగా నగరపాలక సంస్థకు చెందిన ఇంజినీరింగ్ విభాగం అధికారులకు తెలియజేయాలన్నారు. పట్టణ ప్రజలందరూ గమనించి నగరపాలక సంస్థ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. డివిజన్ల వారీగా ప్రజలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు, అధికారుల పేర్లు ఈ విధంగా ఉన్నాయి.

- బీఎల్ సౌజన్య, అసిస్టెంట్ ఇంజినీర్ 98499 07316
  1వ డివిజన్ నుంచి 10 డివిజన్ వరకు..
- కె.రాజశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 99518 51015
  11వ డివిజన్ నుంచి 14 వరకు, 16వ డివిజన్ కూడా..
- డి.అనిల్, వార్డ్ అమినిటీస్ సెక్రటరీ, అసిస్టెంట్ ఇంజినీర్ 96524 42407
  15, 17వ డివిజన్ నుంచి 20వ డివిజన్ వరకు..
  డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను కూడా సంప్రదించవచ్చు.
  ఆమె ఫోన్ నంబర్ టి.పద్మజ 98499 08064
- డి.చాణిక్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 97001 92656
  21వ డివిజన్ నుంచి 30వ డివిజన్ వరకు..
- టి.చంద్రశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్ 98499 06603
  31వ డివిజన్ నుంచి 36వ డివిజన్ వరకు..
  డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.ఐసయ్య దృష్టికి కూడా తీసుకెళ్లవచ్చు.
  ఆయన ఫోన్ నంబరు 98499 06600
- ఎం.నాగార్జున, వార్డ్ అమినిటీస్ సెక్రటరీ, అసిస్టెంట్ ఇంజినీర్ 77309 09498
  37వ డివిజన్ నుంచి 43వ డివిజన్ వరకు..
- డి.సాయిరాం, వార్డ్ అమినిటీస్ సెక్రటరీ, అసిస్టెంట్ ఇంజినీర్ 97049 51782
  44వ డివిజన్ నుంచి 50వ డివిజన్ వరకు..
  ఈ డివిజన్ల పరిధిలో మంచినీటి సమస్యను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీవీ అనిల్ కుమార్ దృష్టికి కూడా తీసుకెళ్లవచ్చు.
  ఆయన ఫోన్ నంబర్ 98499 07313
- నగరంలో ఎక్కడైనా మంచినీటి సమస్య ఉన్నప్పుడు ఒంగోలు నగర మున్సిపల్ ఇంజినీర్(ఎంఈ) ఎన్.చంద్రయ్యను కూడా సంప్రదించవచ్చు. ఆయన ఫోన్ నంబర్ 98499 06599

వేప అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వేప అంకమ్మ తల్లి



గణపతి హోమంలో అర్చకులు, భక్తులు

ఒంగోలు మెట్రో: నగరంలోని సీతారాంపురంలో వేంచేసి ఉన్న వేప అంకమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తుల కొంగుబంగారం.. ముగ్గురమ్మల మూలపుటమ్మగా పూజలందుకుంటున్న వేప అంకమ్మ తల్లికి ఆలయ అర్చకులు ఉదయం ఏడు గంటలకు అమ్మవారికి శ్రీ సూక్తంతో సుగంధ పరిమళ ద్రవ్యాలు వివిధ రకాల పండ్ల రసాలతో పంచామృత అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పూలతో చక్కగా పుష్పాలంకరణ గావించి ధూప దీప మంగళ హారతులతో భక్తులు అమ్మవారి అనుగ్రహం పొందారు. అనంతరం ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన హోమగుండం వద్ద గణపతి హోమాన్ని మంత్రోచ్చారణ నడుమ పూజాక్రతువులను భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పసుపులేటి హనుమంతురావు, సరస్వతమ్మ, ఆలయ అర్చకులు ప్రసాద్ పాల్గొన్నారు.

బావిలో వ్యర్థాల తొలగింపు



కల్లూరివారిపాలెంలో స్కీం బావిలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం



స్కీం బావిలో వ్యర్థాలను తొలగించిన తరువాత పరిశుభ్రంగా ఉన్న నీళ్లు

- హర్షం వ్యక్తం చేసిన కల్లూరివారిపాలెం గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: మండలంలోని కోటపాడు పంచాయతీ కల్లూరివారిపాలెంలో సుమారుగా 200 కుటుంబాలు ఉన్నాయి. అయితే 2004లో గ్రామస్తులకు నీటి కష్టాలు తొలగించడానికి రూ.లక్షలు వెచ్చించి గ్రామానికి సమీపంలోని పాలేరులో రక్షిత మంచినీటి స్కీమ్ బావిని ఏర్పాటు చేశారు. ఈ స్కీమ్ బావి నుంచి గ్రామంలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో పైపులైన్ ద్వారా నీటిని నిల్వ చేసి కుళాయిలతో నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం బావిలో కొంతమేర నీళ్లు ఉన్నా అవి పూర్తిగా పాచి పట్టి కలుషితమై అపరిశుభ్రంగా ఉన్నాయి. ఈ క్రమంలో స్కీం బావి నీళ్లు తాగడంతో అనారోగ్యానికి గురవుతామని భావించిన గ్రామస్తులు, ద్విచక్ర వాహనాలపై ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కె.అగ్రహారికి సెంటర్‌కు వెళ్లి ప్రైవేట్ వాటర్ ప్లాంట్స్ నుంచి 20 లీటర్ల నీటిని రూ.15 కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఈ సమస్యపై సాక్షి దిన పత్రిక లో బుధవారం 'మంచి నీళ్లివ్వండి మహాప్రభో' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు గురువారం పాలేరులోని మంచినీటి స్కీం బావిలో పాచితో పాటు వ్యర్థాలను తొలగించారు. అలాగే నీటిని శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లించారు. దీంతో నీళ్ల సమస్య పరిష్కరించినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల తనిఖీ

హనుమంతునిపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఎంఈఓ జి.పెద్దిరాజు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజర్, రోలు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ, మెనూ, పరిశీలించారు. కూరలు తిని రుచి చూశారు. స్టోర్ రూం, పరిసరాలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బాలికల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు చేశారు. మెనూ అమలు చేస్తున్నారా లేదా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ టి.అంజమ్మ, టీచర్లు ఉన్నారు.

నేటి నుంచి ఎల్‌టీసీ శిక్షణ తరగతులు

పామూరు: పామూరులోని చెత్త నుంచి సంపద తయారీకేంద్రంవద్ద శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు ఎల్‌టీసీ శిక్షణ తరగతులు జరుగుతాయని ఈఓపీఆర్‌డీ జి.అరవిందారెడ్డి తెలిపారు. శిక్షణకు జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పిఓ, ఎంపీడీఓ హాజరుకానున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్లు విధిగా శిక్షణా కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

పొన్నలూరు: మండలంలోని బోగనంపాడులో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను స్థానిక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై అనూక్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న జూదరులను అదుపులోకి తీసుకొని వారి దగ్గర నుంచి రూ.9430 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రికార్డులు ఆడిటింగ్‌కు సిద్ధం చేయాలి



ప్రతిభ కనబరిచిన వీఓఏ శేషమ్మకు బహుమతి అందజేస్తున్న ఏపీఎం

కొండపి: గ్రామైక్య సంఘాల, స్వయం సహాయక సంఘాల రికార్డులను ఆడిటింగ్‌కు సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గోపీనాథ్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘ సహాయకులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నందున గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీల రికార్డులను పరిశీలించి ఆడిటింగ్ చేస్తామన్నారు. ఉల్లాస్ యోజన కార్యక్రమం ద్వారా వయోజనులకు ఆదివారం నిర్వహించే పరీక్షను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. డీఆర్‌డీఏ వెలుగు శాఖలో వివిధ సబ్జెక్టులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు వీఓఏలు శేషమ్మ, గంగాధర, అన్నపూర్ణలను ప్రత్యేకంగా అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ లీగల్ కో ఆర్డినేటర్ ఎం. శ్రీనివాసరావు, సీసీలు మల్లికార్జున, కృష్ణారెడ్డి, రామానుజులు, గోవిందమ్మ, రవణమ్మ, అకౌంటెంట్ కోటేశ్వరి, వీఓఏలు పాల్గొన్నారు.

మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలి



శివశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎర్రయ్య

ఒంగోలు సిటీ: 60 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులకు పదో తరగతి పరీక్షల మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య కోరారు. గురువారం జిల్లా పరీక్షల కమిషనర్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, ప్రిఫరెన్షియల్ క్యాటగిరిలో ఉన్న ఉపాధ్యాయులకు మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. మూల్యాంకన కేంద్రంలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, వేసవి తీవ్రంగా ఉన్నందున కూలర్లను సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టీయూ సీనియర్ నాయకులు కృపాచంద్రుడు, టీసీ గురవయ్య, సుబ్బారావు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కళ్యాణం



కళ్యాణంలో బాల స్వామీజీ, వేద పురోహితులు



శ్రీవారి కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: నగరంలోని రంగారాయుడు చెరువు వద్ద ఫ్యాన్సీ గూడ్స్ అసోసియేషన్ హాల్లో శ్రీనివాసుని కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి శ్రీనివాసుని కళ్యాణోత్సవం నయన మనోహరంగా సాగింది. కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు ముందుగా చూడచక్కని వేదికపై శ్రీనివాసుని ఉత్సవమూర్తుని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది కొలువుదీర్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామాల నడుమ కోదండ శ్రీవారి నిత్య కళ్యాణోత్సవాన్ని రమణీయంగా పూర్తి చేశారు. కార్యక్రమంలో పరమ పూజ్య శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామీజీ) ముఖ్య అతిథిగా పాల్గొనడంతో వందలాది మంది భక్తులు ఆధ్యాత్మిక పారవశ్యంతో పురుషోత్తమునికి నిర్వహించిన కళ్యాణాన్ని కనులారా తిలకించారు.

స్మార్ట్ మీటర్లతో జీవనోపాధిపై దెబ్బ



విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

- విద్యుత్ భవన్ ముందు విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా
- ఒంగోలు ఈఈ హరిబాబుకు వినతిపత్రం అందజేత

ఒంగోలు సబర్బన్: దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని తమ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని విద్యుత్ మీటర్ రీడర్లు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో తమ జీవనోపాధిపై దెబ్బ పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా సర్కారు మౌనం దాల్చడం సరికాదన్నారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్ ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మీటర్ రీడర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దీర్ఘకాలంగా మీటర్ రీడర్స్ ముఖ్యంగా ఉద్యోగ భద్రత, స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో వారి జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారన్నారు. జిల్లాలో ఇప్పటికే పని చేసే రీడర్స్ విద్యా అర్హతల ఆధారంగా ప్రాధాన్యంగా రీడర్స్‌కు ఉద్యోగ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల నుంచి జీతాలు ఇవ్వాలని గతంలోనే ఎస్ఈని కలిసి విజ్ఞప్తి చేసినట్లు గుర్తు చేశారు. కాంట్రాక్టర్లతో, అధికారులతో, యూనియన్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేసి రీడర్స్ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ రీడర్స్ సమస్యలపై కూటమి ప్రభుత్వం సరైన స్పష్టత ఇవ్వడం లేదని, ఓ పక్క రీడర్స్ ఉపాధిని దెబ్బతీయమని చెబుతూనే రైతాంగ విధానాలకు, గృహ ఉపయోగాలకు, చిన్న తరహా పరిశ్రమలకు ఈపాటికి కొన్ని ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. ఇదే జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ రీడర్స్ ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. మీటరు రీడర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి సిద్ధయ్య, నాయకులు నాగార్జున్‌రెడ్డి, హరి, శ్రీహరి, విజయ్, దత్తు, కొండలు పాల్గొన్నారు.